

# ఉద్యోగాలా అనుభవాలా

యెర్నేని జయలక్ష్మి

రేణూ! నా మీద కోపం వచ్చింది కదూ! ఎన్నో ఉత్తరాలకి నీకు సమాధాన మివ్వలేదు. ఇచ్చే స్థితిలో లేను.

నువ్వన్నట్టే నీ దగ్గర దాచాను. పరిష్కారం తెలియక, ఎవరితోనూ గుండెలని దహిస్తున్న ఈ సమస్యకి చెప్పలేక నాలో నేను క్రుంగి పోయాను. ప్రాణానికి ప్రాణమైన నీకుకూడా యింతకాలంగా చెప్ప నందుకు మన్నించు.

కన్నె మనసుతో, పరుగులు తీసే ఊహలతో, అందమైన కోరికలతో, భవిష్యత్తుపై కొండంత ఆశతో, ఊహాలోకాల్లో తేలిపోతూ, బంగారు కలలు కంటూ, అవే నిజ మవుతాయని పూర్ణ విశ్వాసంతో వుండే అనుభవ రహితమైన సున్నితపు హృదయానికి ఆశలు అడియాస లుగా, బంగారు కలలు ఎండమావులుగా కనబడినపుడు–ఆ హృదయా వేదన ఊహించుకోవలసిందే తప్ప చెపితే అర్థంకాదు.

నా ఆశలు, ఆశయాలు, కోరికలు, నన్నొక పరీక్షకి నిలబెట్టాయి. ఇది వరకటి ఉత్సాహం, మనోధైర్యం, ఆత్మ విశ్వాసం ఎక్కడికి జారిపోయాయో! నిరుత్సాహంగా నిరాశా నిస్పృహలతో దారి తెలియని బాటసారిలా ఒంటరిగా చీకటి దారిలో మిగిలి పోయాను.

నా ఆశయాలని నిజజీవితంలో ఆచరణలో పెట్టాలని ఆశపడ్డాను. "ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చి ప్రథమ బహుమతి పొందడం కాదు, ఇప్పుడెంతో ఉన్నతంగా కన్పడే ఆదర్శాలు, ఆశయాలు నిజజీవితంలో ఆచరించబోతే ఎన్నో అడ్డంకులు, అడుగడుగునా కంటకాలు ఎదురవుతాయి. జీవితం వేరు, ఆశయాలు వేరు, అనే దానివి. ఆనాడు ఒప్పుకోని నేను ఈనాడు అదే అనుభవంతో బాధ పడుతున్నాను.

ఒక రోజు ఒక అమ్మాయి నా దగ్గరకొచ్చి "మీరు కథలు వ్రాస్తుంటారా" అని అడిగింది. గుర్తుందా? నన్ను చూడగానే ఆమెకి అలా అనిపించిందని చెప్పింది. ఆ రోజంతా నువ్వు నన్ను ఏడిపిస్తూనే వున్నావు, నీకు తెలియకుండా నేను వ్రాస్తున్నానేమోనని. ఆనాడు వ్రాయలేదు. కానీ యిప్పుడు వ్రాస్తున్నానో కథ. కథలంటే కేవలం కల్పనలు కాదు. జీవితాలే కథలవుతాయని యిప్పుడు తెలుస్తోంది.

మా యిల్లు విడిగా పట్నపు హడావుడికి దూరంగా ప్రశాంతంగా వుంటుందికదూ. చిన్నప్పుడు నాకు ఆడుకోవడానికి ఎవరూ తోడువుండే వారుకారు. మా యింట్లో పనిచేసే కాంతమ్మ తన కొడుకు మధుని కూడా తీసుకువచ్చేది. కాంతమ్మ ఎంతో శుభ్రంగా వుండేది. మధు కూడా గొప్పింటి పిల్లవాడిలానే

ఉండేవాడు; అందానికీ, శుభ్రతకి. మగసంతానం లేని అమ్మ మధూ–నేనూ ఆడుకుంటూవుంటే ఎక్కువగా అభ్యంతరం పెట్టలేకపోయేది.

సాయంత్రం బడినుంచి కారులో రాగానే టిఫిన్ తిని మధుతో ఆడుకునేదాన్ని. మధు నాకంటే రెండేళ్లు పెద్ద. ఒకనాడు ఆడుకుంటూ ఆటలో నేను ఓడిపోయానన్న ఉక్రోషంతో "ఒరే మధుగా! నీతో ఆడను ఫో" అన్నాను. "పోవే రాధీ, నేనే ఆడుకుంటా" అన్నాడు మధు. అమ్మ వింది. ఆవిడ కోపానికి హద్దు లేకపోయింది. కాంతమ్మ పని వదిలిపెట్టి వచ్చి నాలుగు బాదింది. మధు ఎదురు తిరిగాడు. "రాధ నన్ను ఒరే అనలేదా? నేనంటే తప్పేమిటి? తనంటే అన్నానుకానీ, లేకపోతే నేనెప్పుడైనా అన్నానా?" అన్నాడు ఏడుస్తూ. అమ్మ నన్నుకూడా తిట్టింది. ఇంకెప్పుడూ వాడితోకలిసి ఆడకని చెప్పింది. కాంతమ్మ ఎదురు చెప్పాడన్న కోపంతో మరి నాలుగు కొట్టి బరబరా లాక్కెళ్ళిపోయింది యింటికి. ముందు నాకు సంతోషమే అయినా పాపం, మరీ అన్నిదెబ్బలు తిన్నాడే అని బాధపడ్డాను.

మధు మా యింటికి రావడం మానేశాడు. నాకేమీ తోచేదికాదు. నాలుగురోజులకే నాలుగు యుగాలయినట్టనిపించింది. అమ్మకి తెలియకుండా వాళ్ళ యింటి కెళ్ళి మధుని రమ్మని బ్రతిమలాడాను. "మీరు గొప్పింటివాళ్ళు. మేముతక్కువకులం వాళ్ళంఆడకూడదు. "పో"మ్మన్నాడు. నేను ఏడుస్తూ అక్కడే కూర్చున్నాను. కాంతమ్మ మధుని మందలించి నన్నెత్తుకుని తీసుకుని వచ్చింది. అప్పటినుంచి మే మెప్పుడూ పోట్లాడుకోలేదు. అమ్మ మధుకికూడా నాతోపాటు చిరుతిళ్ళు పెట్టేది.

మేము పెద్దవాళ్ళమయినా మా స్నేహం మాసిపోలేదు. మధు స్కాలర్‌షిప్‌లతో బి. ఏ. ఫైనల్‌కి వచ్చాడు. ఫీజులకి నాన్నగారుకూడా సహాయం చేస్తూండేవారు. నేను బి. ఏ. లో చేరటంతో తన నోట్సు నాకు యిస్తూ అర్థంకానివి చెబుతుండేవాడు.

చిన్నప్పటినుంచి నాకు బొమ్మలంటే పిచ్చి. ఏదైనా అందమైన చిత్రం కనపడితే అలానే చూస్తూండిపోయేదాన్ని. అంత అందంగా ఎలా వేయగలుగుతారా అని ఆశ్చర్యపోయేదాన్ని.

మొదటిసారి నా చిత్రమొకటి పత్రికలో పడగానే మీ రంతా మెచ్చుకున్నారు. పోయిన ఏడాది చిత్రలేఖనం పోటీలో నా చిత్రానికి మొదటిబహుమతి వచ్చింది. అందరి ప్రశంసలతోపాటు నువ్వూ–మధూకూడా అభినందించారు. ఈ మధ్య నా చిత్రాలు కన్పడటంలేదని ఎందరో అభిమానుల ప్రశ్నలు. యథావిధిగా పంపవలసిందని సంపాదకుల కోరికలు. కాని ఎలా? ఆ శక్తి నశించింది. ఆ ఉత్సాహం పోయింది. ఆ రాధే







...డు. ఈ రాధలో ఉత్సాహం, ఆసక్తి తగ్గి నిరాశా, నిస్పృహలు పేరుకున్నాయి. కారణం—ఇది పూర్తిగా చదివితే నీకే తెలుస్తుంది.

"రాజేష్" కథలని మనిద్దరం ఎంతగానో మెచ్చుకునేవాళ్ళం–గుర్తుందా? అతని కథలలో కొన్ని సన్నివేశాలు నన్ను కదల్చివేసేవి. హృదయానికి హత్తుకుపోయేవి. నాకు తెలియకుండానే అతన్ని ప్రేమించడం మొదలెట్టాను. ఆ ప్రేమ దాచుకోలేక అతనికి ఉత్తరాలు వ్రాసేదాన్ని. కానీ, నాకేనాడూ సమాధానం రాలేదు. నేనెంతగానో బాధపడేదాన్ని. నా ఊహలతో అతని చిత్రమొకటి గీసి దాన్నే ఆరాధిస్తూ అతని సమాధానం ఏనాటికైనా రాకపోతుందా అని ఆశతో నిరీక్షించేదాన్ని. అతను వివాహితుడేమో నని భయమేసేది. ఐతే ఒక్క సమాధానంతో నా ఆశల నింకా పెరగనీయకుండా, నా ప్రేమలతని అల్లుకునిపోనీకుండా చేయవచ్చుకదా" అని అనుకునేదాన్ని.

నా మనసు విప్పి అతనిముందు పెట్టేదాన్ని. నా కోరికలు, ఊహలు అన్నీ తెలిపేదాన్ని. అతన్నెంతగా ప్రేమిస్తున్నానో, అతని సమాధానంకోసం ఎంతగా నిరీక్షిస్తున్నానో వర్ణించేదాన్ని. కాని, ఫలితం—శూన్యం. విసిగెత్తి, బాధపడి ఒక నెలరోజులపాటు అతనికి ఉత్తరాలు రాయ్యలేదు. "నా సామికోసం ఎదురుచూస్తి" అనే నా చిత్రం పత్రికలో ప్రచురించిన కొద్దిరోజులకే అదే పేరుతో అతని కథ ఒకటి ప్రచురితమయింది. నాకు చాలా ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

ఒక అందమైన ధనవంతులమ్మాయి మరొక అందమైన యువకుడిని ఏదో పార్టీసందర్భంలో చూసి ప్రేమిస్తుంది. వారి పరిచయం ప్రేమని తెలుపుకునే స్థితికి రాకుండానే అతను విదేశాలకెడతాడు. వెళ్ళేముందు ఆమెదగ్గరకొస్తాడు. కానీ, ఆమె తన ప్రేమని వ్యక్తపరచ లేకపోయింది. అతని దగ్గరనుండివచ్చిన లేఖ—అందులోని ప్రేమని చూసి ఆ అమ్మాయి ఎగిరి గంతేస్తుంది. చూపులతో మొదలైనఅనురాగానికి లేఖలు వారిమధ్య ప్రేమలతని బలంగా అల్లుతాయి. అతని రాకకోసం ఎంతగానో నిరీక్షిస్తూ తల్లీ తండ్రులు చూసే సంబంధాలన్నీ తిప్పికొడుతుంది. అతను తిరిగి వస్తాడు. ఆ అమ్మాయి ఆనందానికి అవధులుండవు. తండ్రిని పంపుతుందతని దగ్గరికి. పెద్దలతో సంప్రతించి ముహూర్తం పెట్టుకురావడానికి వెళ్ళిన తండ్రి సింహ గర్జన చేస్తూ తిరిగి వస్తాడు. అతని కేమీ ఆస్తిపాస్తు లుండవు. అయినా తండ్రి అభ్యంతర పెట్టడు. కానీ కులభేదం అడ్డు వస్తుంది. అతని కులం సంఘ దృష్టిలో చాలా తక్కువది. ఇంకా వివరాలు ఆరా తీయగా ఆయన తండ్రి కాలంలో పనిచేసిన

పాలేరు కొడుకే అతనని తెలుస్తుంది. ఆ అమ్మాయి క్రుంగి పోయింది. తల్లి తండ్రులను కాదనలేదు. ఎదురు తిరిగినా, తమ పాలేరుకొడుకుని చేసుకోవడమా అని బాధ పడుతుంది. తన ప్రేమని చంపుకోలేదు. ఎటూ నిర్ణయించుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె తన స్వామి కోసం ఎదురు చూసిన సన్నివేశం, ఆ తర్వాత మరో లోకంలోవున్న తన స్వామి కోసం నిరీక్షించే ఆ అభాగిని ప్రేమ, పాఠకుల హృదయాన్ని కట్టివేస్తాయి. ఆకథ నన్నెంతగానో కదిలించింది.

ఆ కథే యింకోసారి చదివి నా రాజేష్ చిత్రాన్ని ముందు వేసుకుని కూర్చున్నాను. ఆ చిత్రంలో రాజేష్‌ని నిజంగా భ్రమించి తదేకంగా చూస్తూ నన్ను నేనే మరచి పోయాను.

"రాధీ!" మృదువుగా ఎవరో పిలిచినట్లుంది. నాస్వామి నన్ను కరుణించాడన్న భ్రాంతితో ఆ చిత్రాన్ని ముద్దెట్టుకున్నాను. సన్నగా నవ్వు వినపడి ఉలిక్కిపడి చూశాను. ఎదురుగా మధు! నాకు సిగ్గు, కోపం ముంచుకు వచ్చాయి. అతనుచూసి నాచేతిలో చిత్రం చనువుగా లాక్కున్నాడు. క్రింద నేను అందంగా "నారాజేష్" అనిచెక్కాను. అది చూసి కొద్దిగా తెల్లబోయాడు. నేనది లాక్కుని పారిపోయాను. కొద్ది సేపుండి ఎంత పిలిచినా నేను రాకపోవడంతో అమ్మతో, మాట్లాడి వెళ్ళిపోయాడు మధు.

అప్పటినుంచి మధుతో సరిగ్గా మాట్లాడలేక పోయేదాన్ని. ఒకనాడు నా చిత్రాల విమర్శతో ప్రారంభమై "రాజేష్" కథల ప్రస్తావన తెచ్చాడు మధు. అంతకు ముందు నేనెన్నో సార్లు అతని కథలని పొగిడేదాన్ని. మధు చిరునవ్వుతో వింటుండేవాడు. కాని, ఆనాడు అతని పేరైనా ఉచ్చరించ లేకపోయాను. మధు "నా సామి కోసం ఎదురు చూస్తి" ప్రస్తావన తెచ్చాడు. నేను ఆగలేక ముగింపు మరీ అన్యాయంగా వుందన్నాను. "కాదు. అది సహజమే. అంత గొప్పింటి బిడ్డ చూస్తూ చూస్తూ ఒక పాలేరు గుడిసెలో అడుగుపెట్టలేదు" అన్నాడు మధు. నా కావాదన నచ్చలేదు. "ఆ అమ్మాయి ప్రేమ అంత గొప్పదైతే ఆమెకి అంతస్తులు అడ్డురావు. ఐనా ఆమె వెళ్ళి గుడిసెలో కాపుర చేయనవసరంలేదు కదా. తను వేరుగాభర్తతో సుఖంగా వుండేది. అనవసరంగా ప్రాణాలు తీసుకుని అవివేకంగా ప్రవర్తించింది" అన్నాను.

"రాజేష్‌ని ప్రేమిస్తున్నావా?" సూటిగా అడిగాడు మధు. నే నేమీ మాట్లాడలేకపోయాను.

"అతన్నెప్పుడైనా చూశావా?" అతని ప్రశ్నలకి నాకు కోపంవచ్చింది. కానీ, ఏమనలేక "లే"దన్నాను. "మరెలా ప్రేమిస్తున్నా"వన్నాడు. "అతన్ని








చూడకపోయినా అతనెలా వుంటాడో ఎలా మాట్లాడతాడో, అతని భావాలేమిటో నాకు తెలుసు" అన్నాను. కొద్దిగా గర్వంగా, కోపంగా నవ్వి వెళ్ళిపోయాడు మధు.

మధు బి. ఎ. తో ఆపి ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళ నాన్నకు వచ్చేదీ, ఇతనికివచ్చే జీతంతో వాళ్ళకి హాయిగా గడిచిపోతుందని కాంతమ్మని బలవంతంగా మానిపించాడు మధు. ఐనా వాళ్ళిద్దరూ రాకపోకలు మానలేదు. ఏదో తెలియని అనుబంధం మా రెండుకుటుంబాలమధ్య పెనవేసుకునివుండేవి. మధు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే నాన్నగారు ఎంతో సంతోషించి, ఏ పెన్నో, బట్టలో కొనిపెట్టేవారు. నాకు కొద్దిగా జ్వరంవచ్చినా కాంతమ్మ ఖంగారుపడిపోయేది. మధు పెద్దవాడైనాక అమ్మ "ఒరే మధూ" అనటం మాని "మధూ" అనేది. "మధుగాడు" "అతను" అయ్యాడు. వాళ్ళు యిల్లు మారి మాకు కొద్దిగా దూరంగావున్న మంచియింట్లోకి వెళ్ళేరు.

ఒకనాడు పబ్లిక్ గార్డెన్స్‌లో మధు మరో అమ్మాయితో కూర్చుని ఉండటం చూశాను. నా కెలాగో అనిపించింది. మధు ఖంగారుపడటం చూసి నేను చూడనట్టువెళ్ళిపోయాను. మరునాడే మధు వచ్చాడు. "కాంతమ్మ

నీకు త్వరలో పెళ్ళిచేయాలని వుందని అమ్మతో చెప్పిందట. జాగ్రత్తపడు" అన్నాను నవ్వుతూ. మధు అదోలా అయిపోయాడు.

"రాధా! నా మాట నమ్మాలి" అన్నాడు జాలిగా.

"ఏమని?" కొంటెగా అడిగాను.

"ఆ అమ్మాయి మా ఆఫీసులో పనిచేస్తోంది. నేను వ్రాసుకుంటూ వుంటే తనుచూసి అప్పుడే వచ్చింది–"

"నన్నూ అప్పుడే చూసి ఖంగారు పడిపోయావు నువ్వు. పానకంలో పుడకలా నే నెందుకని వచ్చేశాను. ఐనా రసభంగం చేస్తే పాపం చుట్టుకుంటుంది" అన్నాను నవ్వుతూ.

"అయితే నాకూ ఒకసారి చుట్టుకుంది" అన్నాడు మనసారా నవ్వుతూ. "ఎప్పుడూ?" అనబోయి నాలిక్కరుచుకుని కోపంగా చూశాను.

"అయిందా అమ్మాయిగారి పని. మరి కాస్త పూర్తిగావిను.

ఆవిడని నేనుకాని, నన్నావిడ కాని ప్రేమించలేదు. అసలా ప్రసక్తేలేదు. మా మధ్య. ఏవో తెలిసిన ముఖం కాబట్టి పలకరించింది. దాన్ని పట్టుకుని ఏవో ఆరాలుతీస్తున్నావ్ నువ్వు."

"ఉహూఁ నమ్మను" అన్నాను కొంటెగా నవ్వుతూ.

"నీ రాజేష్‌కి ఉత్తరం వ్రాస్తా" మెరిసే కళ్ళతో నవ్వుతూ బెదిరించాడు మధు.

"ఆ రాజేష్ సంగతి నాదగ్గర తేకు" అన్నాను కళ్ళల్లో తిరుగుతున్న నుడులు కనపడనీయకుండా ఎటో చూస్తూ.

మధు తెల్లబోయి చూశాడు. "అంత కోపం వచ్చిందా?" అన్నాడు నెమ్మదిగా నవ్వుతూ.

అప్రయత్నంగా నా కళ్ళనుండి అశ్రువులు జలజలా రాలి పడ్డాయి.

మధు అదిచూసి ఖంగారుపడ్డాడు. "అదేమిటి రాధా?" అంటూ దగ్గర కొచ్చి కన్నీరు తుడిచాడు. అంతలోనే ఏదో తప్పుచేసినవాడిలా వెనక్కి తగ్గాడు. నా కందులో తప్పేం కనిపించలేదు. చిన్నప్పటినుండీ కలసి మెలసి వున్నాం. మా మధ్యవున్న అనుబంధం అలాటి దనిపించింది. అంతవరకూ దాచుకున్న ఆవేదన అతని ముందు దాచలేకపోయాను. అంతా విని నిట్టూర్చాడు మధు.

"అతని కథలలో కులమత భేదాల ప్రసక్తి యెక్కువగా కనపడుతోంది" అన్నాను. "నేను మా కటువంటి పట్టింపులు లేవని స్పష్టంగా ఎన్నోసార్లు వ్రాశాను. మా కులం వ్రాస్తూ అతనే కులంవాడైనా నాకేం అభ్యంతరం వుండదని వివరంగా వ్రాశాను" అన్నాను. అతనికి వివాహం అయిపోయిందేమోనన్న సందేహం, భయం, అవ లేదనిపిస్తోందన్న ఆశా — రెండూ వెళ్ళగ్రక్కాను. తనకీ — వివాహం అయివుండదనే అనిపిస్తోందన్నాడు మధు.

రేణూ! నవ్వుతావుకదూ — కథలు చదివి యెలా ప్రేమించావని? కానీ, అసహజంగా, అసంభవంగా కన్పడేవే సహజమై సంభవ మవుతుంటాయి కొన్నిసార్లు.

మధు ఏ సంబంధము యిష్టపడటంలేదని కాంతమ్మ గోలచేస్తూ చెప్పింది. నా వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో అనుకోకుండా నాకు ఉత్తరంవచ్చింది. ఆత్రుతతో విప్పాను.

"ప్రియమైన రాధీ!

ఎన్నాళ్ళకో నీకు సమాధానం యిస్తున్నందుకు మన్నించు. ఇన్నాళ్ళు ధైర్యం చేయలేక పోయాను. మన ప్రేమకి మధ్యగా ఎన్నో అడ్డుగోడలు లేస్తున్నాయి. పెద్ద అగాధానికి చెరోవైపు నిలబడి వున్నాం. అందుకే యింతకాలం నీకు లేఖ రాయడానికి, నా ప్రేమని చెప్పుకోడానికి సందేహించాను.

మన దేశం ఎంతగా అభివృద్ధి చెందినా, ఎన్ని అభ్యుదయ భావాలను నినాదం చేసినా మన సమాజంలో యింకా పాత సంప్రదాయాలు, ఆచారాలు తొలగి పోలేదు. ఉన్నత కుటుంబానికి చెందిన యువతికీ, తక్కువ కులానికి చెందిన యువకుడికి మధ్య ప్రేమ ఎలాటి ఫలిత మిస్తుందో ఊహించ లేక పోతున్నాను. నువ్వు ఉన్నత వంశజవి కాకపోయినా, నే నీ కులంలో పుట్టక పోయినా మన మధ్య ఈ దూరం వుండేది కాదు. మన సమాజం ఆదర్శాలని వల్లెవేయ గలదుకానీ, ఆచరణలో సహించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రేమ ఏ విధంగా పరిణమిస్తుందో, ఎట్టి ఫలితమిస్తుందో?

నువ్వు "రాజేష్"ని ప్రేమించావు. నీకు సమాధానం రాలేదని విలపించావు. చివరికి విసిగెత్తి విరక్తితో అతని ప్రసక్తే తేవద్దన్నావు. నేనూ నిన్ను ప్రేమించాను. కాని అది ఎలావ్యక్తపరచను? అది నీ మీద ఎలాటి ప్రభావం కలిగిస్తుందోనని భయపడ్డాను. కానీ నువ్వు నా కథలని–మరోవిధంగా నన్ను, ప్రేమిస్తున్నావని తెలిసిననాడు నా ఆనందం వర్ణనాతీతం. కాని మరో సమస్య. నీకు "రాజేష్" ఎవరో తెలియదు. తెలిస్తే ఆ ప్రేమ నిలుస్తుందా?

నీ ఉత్తరాలు నన్ను కవ్వించేవి. నీ ప్రేమకి జోహార్లు అర్పించాను. ఆరాధించాను. కాని యింతకాలంగా నా ప్రేమని గుప్తంగా వుంచాను. గుండెల్లో దాచుకున్నాను. కానీ, యిలా ఎంతకాలం దాగుడుమూతలు ఆడను? అందుకే ధైర్యం చేసి నిజాన్ని బయటపెడుతున్నాను. చెదరిన నా హృదయానికి "నా సామి కోసం ఎదురుచూస్తి" మీద నీవిమర్శ ధైర్యాన్నిచ్చింది, ప్రోత్సాహ పరిచింది. తన పాలేరు కొడుకుని చేసుకుని సుఖపడవచ్చన్న నువ్వు నీ పని మనిషి కొడుకుని కూడా అదే ఉదారతతో ఆదరిస్తావన్న విశ్వాసం వుంది. ఇంకేం వ్రాయను? నీ సమాధానం కోసం పరితపిస్తూ—

నీ

రాజేష్ — మధు.

ఆ క్షణంలో వే నేస్థితిలోవున్నానో ఊహించుకోగలవు. నా మెదడు పని చేయటం మానివేసింది. తలుపులు వేసుకుని పడుకున్నాను. అమ్మ హడా విడిగా వచ్చి ముఖం కడుక్కుని పట్టు చీరకట్టుకోమంది. తెలివుండేచేశానో, ఎల్లా వెళ్ళి అతనిముందు కూర్చున్నానో నాన్నగారు అడిగినప్పుడు ఆలోచనా రహితంగా "సరే" అని ఎలాఅన్నానో నాకు తెలియదు. కాని జరిగిందేమి టంటే, నేను ఆ ఇంజనీరుగారికి నచ్చానుకాబట్టి ప్రదానం, ముహూ ర్తం పెట్టుకోవడం అన్నీ జరిగిపో యాయి. మరో పదిహేనురోజులలో నేను శ్రీమతిని కాబోతున్నాను.

ఆత్మద్రోహం చేసుకున్నా నం టావా? ఆదర్శాలని గొప్పలుచెప్పి ఆచరణలో పెట్టలేక పారిపోయిన పిరికి నంటావా? నా ప్రేమకి అర్థం లేదంటావా? లేక నాది పవిత్రమైన ప్రేమ కాదనీ, అయితే అంతస్థులు అడ్డువచ్చేవి కావంటావా? నీ రాధ బాధపడుతుందని నువ్వనకపోయినా నా మనసే నన్ను సవాలు చేస్తోంది.

అతని కథలోలాగా ముగింపుచేద్దా మనుకున్నాను. కానీ, ఈ ప్రాణాలు అంత త్వరగాపోవు.ఈ రంపపుకోతను యిలా అనుభవించవలసివుండగా అప్పుడే ఎలా మరణిస్తాను.

అత నెన్నోవిధాల తన పరిస్థితి, మా ప్రేమ సఫలమవటానికి వున్న అభ్యంతరాలని ఎత్తి చూపించాడు. కాని, నేను సరిగ్గా అర్థంచేసుకోకుం డానే నా ఆదర్శాలని వల్లించాను. అతడిని పరోక్షంగా రెచ్చగొట్టాను. అతని ప్రేమలతకి నీరుపోసి స్వయం గా పెంచి, యీ నాడు గొడ్డలితో సమూలంగా నరికివేశాను. నా కెవ రిచ్చారీ అధికారం?

"ఒరేయి మధూ!" అన్న నాలుకతో "ఏమండీ"అనలేను. అమ్మా నాన్నలతో అనిపించలేను. ఐనా ప్రేమించింది రాజేష్‌ని, మధుని కాద నుకుంటాను నేను. కాదు—అంతరం గంలో మధుమీద అనురాగంవుంది కానీ, అంతస్తులభేదం గుర్తుకువచ్చి భయపడ్డావని—ఎదురుతిరుగుతోంది మనసు.

పెళ్ళిపనులకి కాంతమ్మని పిలిపిం చింది అమ్మ. మధుకి నా పెళ్ళికి ఉండటానికి వీలు లేదని వచ్చిన ట్రాన్స్‌ఫరుని తిట్టింది కాంతమ్మ. సెలవు పెట్టి వుండిపొమ్మని బలవంతం చేసింది అమ్మ. నాన్నగారు ట్రాన్స్ ఫరుని మార్పించి తిరిగి యిక్కడికే వేయిస్తానన్నారు. ఆ క్షణంలో నా వైపు చూసిన చూపులకి అర్థం చెప్ప లేను. కళ్ళల్లోని బాధ నన్ను శపించ లేదు, నాశనం చేయలేదు. కనీసం నా మీద నాకు కోపమైనా రాలేదు. జాలిగా నవ్వుకున్నాను. ఎండి బీటలు బారిన హృదయం అంటే ఏమిటో, కఠిన పాషాణం అంటే ఏమిటో ఇప్పుడు నాకుబాగా తెలుసు.

పెళ్ళికి రావాలనిపిస్తే రా. ఇంత కంటె ఎలా ఆహ్వానించను? మరో విషయం. మధు వివాహం నిన్ననే అయింది. ఆత్మహత్య చేసుకోబో తున్న ఒక అనాథను రక్షించి దేవా లయంలో పెళ్ళాడాడట. నా ఆశ యాలని, ఆదర్శాలని వెక్కిరించ టానికేమో!

ఇక వుంటాను,
రాధిక.

□□□

# పరీక్ష

వడ గాడ్పులు చంద్ర నిప్పుల్ని తూర్పార పడుతున్నాయి. చెట్టూ చేమా నిశ్చలంగా వున్నాయి. నిప్పులు పరచినట్లున్న తారురోడ్లు శూన్యంగా వున్నాయి. ఆదివారం పూట, గాలి పారాడని యింట్లో వేసవి పెట్టే బాధ ఇబ్బడి ముబ్బడిగా వుంది.

"నమస్కారమండీ!" ఎండ యిం ట్లోకి రాకుండా వేసిన తలుపును తోసుకుంటూ ఒకతను లోపలి కొచ్చాడు.

"రండి-కూర్చోండి" అన్నాను.

కూర్చున్నాడు.

"మీరు ... ..." అతడు నా ప్రశ్నను వినటంలేదు. గోడకు వేలాడు తున్న నా పెళ్ళి ఫొటోను తదేకంగా చూస్తున్నాడు.

"మీరెవరో చెప్పారు కారు! సభ్యంగా ధ్వనించే కంఠంతో ప్రశ్నిం చాను.

"ఒక బీద బ్రాహ్మణ్ణి" ఏదో ఆలో చనల్లోనుంచి మాట్లాడాడు.

ఎండకు మగ్గిపోయిన దేహ చ్ఛాయ. ఈబ్రతుకును నిరసించి ఎక్కడో చూస్తున్న కళ్ళు. రాలి పోయిన కనుబొమల క్రింద నిశ్చల మైన గాజు కళ్ళు. ఆలోచనతో తెరుచుకున్న నోట్లో అరిగి పోయిన పళ్ళు-కానీ ఏదో ఆకర్షణ... ... ఆమాట తెలుస్తూనే వుంది. కానీ అడి గాను.

"ఏ పనిమీద వచ్చారు?"

"ఈనెల పదిహేనో తారీఖున నా కూతురికిపెళ్ళి. బీదబ్రాహ్మణ్ణి. మీరే